# 8 ఉద్యోగం

పదహారేళ్ళు కష్టపడి చదివి సంపాయించిన బి. ఎ. పట్టా ఎంతవరకూ జీవనాధారం కాగలదో తెలుసుకునేందుకు. గత రెండు సంవత్సరాల అనుభవమూ చా లనిపిస్తోంది. మొదట్లో చిన్న చిన్న ఉద్యోగాలు-హోదాకూ, పెద్ద చదువులకూ, చాలవని యీసడించుకోవటం జరిగినా, కాలం జరిగేకొద్దీ ఏదో వొక గౌరవనీయమైన ఉద్యోగంతో తృప్తిపడేందుక్కూడా సిద్ధపడ్డాను. చదువుకునే రోజుల్లో డబ్బు సంపాయించట మంటే కేవలం పోష్టుమాన్ తీసుకొచ్చే మనియార్డర్ల మీద రెండేసి సంతకాలు పారెయ్యటమే కదా ననే అభిప్రాయం ఉండేది. కాని అలాటి ఒకో మనియార్డర్‌కు కుటుంబం ఎంత తల్లడిల్లిందో, ఉన్న ఆస్థిపాస్థుల రూపం ఎలా సన్నగిల్లుతూ వొచ్చిందో, యీ నాటిక్కాని అర్థంకావటంలేదు. వెధవ చదువులకు ఖర్చుపెట్టిన దాంతో ఏ చిల్లర కొట్టు పెట్టుకున్నా బాగుండేది. ఇలాటి ఆలోచనల వల్ల జరిగిపోయిన దాన్ని గూర్చి బాధపడటం తప్ప, మరే ప్రయోజనమూ లేదు.

ఇన్నాళ్ళూ నా బాధ్యతల్ని వహించిన కుటుంబీకులు, ఇప్పుడు నేను బాధ్యత వహించాల్సిన అవసరాన్ని క్షణక్షణమూ తెలియపరుస్తునే ఉన్నారు. రోజు రోజుకూ నామీద కుటుంబానికే గౌరవం తగ్గుతోంది; భార్యక్కూడా అలు సవుతున్నాను.

నిజమే-సంపాదన లేని వాడంటే ఎవరికి లెక్క? ప్రపంచంలో ప్రతి విషయనికీ డబ్బు గీటురాయిలాటి దయింది. డబ్బు తేలిగ్గా వొచ్చి పడుతూన్నప్పుడు ఎంతో గొప్ప ఆశయాలూ, అభిప్రాయా లుండేవి. ఇప్పు డవన్నీ పటాపంచలైనవి. ఈ ఆశయాలు నా స్వంత మనుకోవటం, వాటిని విడనాడకుండా వేళ్ళాడా లనుకోవటంలో అర్థం లేదు. ఎందుకంటే, ఆ ఆశయాలకోసం నా ఒక్కడి జీవితాన్నీ దగ్ధం చేసుకోవటంలో న్యాయం

ఉండొచ్చేమో కాని, మిగతా కుటుంబీకులను యజ్ఞపశువులుగా చేయటం కన్న ఘోరం, కృతఘ్నతా ఉండదు. ప్రపంచానికి ఒక చదువుకున్న మూర్ఖుడుగానూ, కుటుంబానికి నిష్ప్రయోజకుడుగానూ బతకటం భూ భారమే అవగలదు. అందుకనే అహాన్ని చాలా వరకు చంపుకున్నాను. చిన్న ఉద్యోగమైనా సరే, నా ఆత్మబంధువుల క్షేమంకోసం చేయాలనే నిశ్చయించుకున్నాను.

అచ్చు పుస్తకాల్లో మచ్చుకైనా కనిపించని ప్రాపంచిక ధర్మాలు కాలేజి నుంచి బైటపడ్డాకనే తెలుసుకోగలుతున్నాను. బి. ఎ. పట్టా చూసి భయపడి, దూరానికి నెట్టేసే షావుకార్లూ, చిన్న ఉద్యోగా లివ్వటం అధర్మమని భావించే పెద్ద మనుషులూ, పెద్ద ఉద్యోగా లనేవి చేసేందుకు తమ బంధు మిత్రుల్లోనే చాలామంది మిగిలి వున్నారనే వొంకతో సాగనంపే పలుకుబడిదారులూ—ఇలాటి అనేక రకాల మనుషుల విచిత్ర ప్రవృత్తులు అర్థమవ సాగినయ్. ఐతే కేవలం మానవ మనస్తత్వ పరిశీలనవల్ల మరి కొంత విజ్ఞానం లభ్య మవొచ్చు కాని, ఉన్న విజ్ఞానాన్నే రొక్క రూపానికి మార్చుకో లేని నాకది చాలా అనవసరం.

చెప్పుల జతలు మారినయ్ కాని, నా స్థితేమీ మారలేదు. ఉద్యోగం సంగతి ఎలా వున్నా అసలు కాలాన్ని సద్వినియోగం చేయటం కూడా కుదరటం లేదు. ఆర్థిక దుస్థితి పెరుగుతోంది. రోజు రోజుకూ ప్రపంచం నన్ను కించ పరుస్తూనే వుంది; నన్ను నేనే కించపరుచుకుంటున్నాను. మరి కొద్ది రోజులు గడిస్తే ప్రపంచ మంటే భయపడిపోయి ఆత్మహత్య చేసుకోవటమో, పిచ్చెక్కటమో, లేక సమస్యల్ని ఎదుర్కోలేక సన్యాసం పుచ్చుకోవటమో జరుగుతుం దనే భయం వెంటాడుతోంది.

మొదట్లో ఉద్యోగంకోసం మృదువుగా ప్రోత్సహించే కుటుంబీకులు, ఇప్పుడు చాలా కఠినంగా శాసిస్తున్నారు. అనవసరంగా చీటికీ మాటికీ భార్య కూడా కసురుకుంటోంది; ప్రపంచమంటే తెలియని ఏడాది కుర్రాడు కూడా నన్నుచూసి వెక్కిరిస్తున్నాడు. అన్నిటినీ మించి నా అంతరాత్మే నన్ను అధికంగా పీడిస్తోంది. నన్ను నేనొక దద్దమ్మగా, వెధవగా చిత్రించుకున్నాను. ఐతే పైకి కనపడకుండా నన్నొక ప్రయోజకుడుగానే ప్రదర్శించుకుంటూ, ఏ వొక్కరైనా నన్ను నిజంగానే ఉపయోగ పెట్టుకొని, ప్రపంచ వాసానికి అర్హుణ్ణిగా చేస్తారేమోననే ఆశతో తిరుగుతున్నాను.

ఇక యీ వూరు లాభం లేదని తేలిపోయింది; ఇన్నాళ్ళూ ఇతరులు ఆ మాట నా చెవిన వేసినా, ఇంట గెలవాలనే ఆశయం నన్నీ పొలిమేరల్ని దాటనీలేదు. ఇప్పుడు ప్రపంచమంటే చాలా విశాల భూభాగ మనే జ్ఞానం కలిగింది.

ఈ విశాల ప్రపంచంలో మొట్టమొదట నా మనసులో మెరిశాడు శేఖరం! వాడు మాకు దూరపు బంధువేగాక, చిన్నతనంలో ఒక ఏడాదిపాటు వాళ్ళింట్లోనే ఉండి చదువుకున్నాను.సంవత్సరాలు గడిచిపోయినయ్;బహుశా వాడు నన్ను మరిచిపోయే ఉండొచ్చు, ఐతేనేం, నన్ను నేను వాడికి జ్ఞాపకం చేసుకుంటాను.మధ్యలో గడిచిపోయిన సంవత్సరాలవల్ల స్నేహం సన్నగిలేందుకు వీల్లేదనే భావాన్ని కలిగిస్తాను. వాడు ఐశ్వర్యవంతుడు. యీ మధ్యనే భారీగా ఎగుమతి దిగుమతి వ్యాపారాలు చేసే పెద్ద కంపెనీకి మేనేజర్‌గా ఉంటున్నాడని విన్నాను.కనుక వాడివల్ల నాకు తప్పక సహాయం జరుగుతుంది.

ఇంత మిత్రత్వాన్నీ చివరకు ఒక ఉద్యోగం కోసం బలిపెట్టటం, ఆ తరువాత వాడికింద నౌకరీ చేయటం తలకొట్టేసు కోవటం లాటిదే ఐనా, భుజాల మీద మరికొన్నాళ్ళపాటు యీ తల నిలబడాలంటే, మరో మార్గం లేదు. అభిమానాన్ని చంపుకోనిదే ప్రపంచంలో తిరగలేమనే నగ్న సత్యం ఏనాడో నసాళానికి అంటింది.

## 2

అమ్మయ్య! నన్ను చూడగానే గుర్తించి, ఆపేక్షతో బంగళాలోకి ఆహ్వానించాడు శేఖరం.వాడి హోదా, ఐశ్వర్యం చూస్తే కళ్ళు కుట్టటమే కాదు; నాబోటివాణ్ణి ఆదరించవలసిన అవసరం మాత్రం ఏమున్న దనిపించింది, శేఖరం మనసు మారక పోవటం నిజంగా నా అదృష్టమే!

చిన్ననాటి ముచ్చటల్లో వినోదంగా,కులాసాగా మాట్లాడుకోవటంలో, ఆ ఉదయమంతా గడిచింది; ఆ ఐశ్వర్యమంతా నాదే నన్నంత ఆనందంలో- వొచ్చిన పని కానీ, నా స్థితి కానీ మరిచిపొయ్యానంటే ఆశ్చర్యంలేదు. ఒక క్షణంలో ఉద్యోగం సంగతి ప్రస్తావిద్దా మనిపించింది కాని, అప్పుడే ఏం తొందర లెమ్మని ఊరుకున్నాను. కనీసం కొద్దిసేపన్నా నా బాధల్ని మరిచి

పోగలిగినందుకూ, మనశ్శాంతి సులభంగా లభ్యమైనందుకూ పారవశ్యత ఆవరించిందేమో!

పదకొండింటికే భోజనాలైనయ్. ఆ తరువాత వాడు ఆఫీసుకు వెళ్తాడనుకున్నాను. కానీ వెళ్ళకుండానే ఎన్నో విషయాలు, ఇతర సమయాల్లో కొరగాని వాటినే ఎంతో నిపుణతతోనూ, నాకెంతో ఇంటరెస్టుగా ఉండేట్లుగానూ చెపుతున్నాడు. నాగస్వరానికి కట్టుబడిపోయిన నాగుపామువలె ఉండిపోయ్యాను.

ఇంతలో కిందినుంచి జావానొకడు వొచ్చి, చేతులు కట్టుకొని నిలబడ్డాడు, శేఖరం విసుక్కొని "ఏమిటి?" అన్నాడు.

"ఆఫీసు నుంచి ఫోన్ వొచ్చింది;ముఖ్యమైన కాగితాలేవో చూడాలట. తమర్ని రమ్మన్నారు" అన్నాడు వాడు.

"ఇప్పుడొచ్చేందుకు వీల్లేదని చెప్పు; సాయంత్రం నాలుగింటికి వొస్తానను....అన్నట్లు డ్రైవర్ని కూడా నాలుగింటికి సిద్ధంగా ఉండమను" అన్నాడు శేఖరం, ఎంతో నిర్లక్ష్యతతో. సేవకుడు క్షణంకూడా నిలబడకుండా వెళ్ళిపొయ్యాడు.

అదృష్టవశాత్తూ చాలా పెద్ద ఉద్యోగమే వాడికి దొరికింది, ఐతే ఆ ఉద్యోగంపట్ల శేఖరానికి ఏమీ గౌరవం లేదు; చాలా తేలిగ్గానూ, నిర్లక్ష్యంగానూ చూస్తున్నాడు. నేనే ఐతే యావత్ ప్రపంచంకన్నా ఉద్యోగాన్నే ఎక్కువగా చూసుకునేవాణ్ణి. ఐతే బొడ్డులో బంగారంతో పుట్టాడు కనుక, వెధవ ఉద్యోగాన్ని లెక్కచేయని మన స్తత్వం శేఖరానికి అలవడి ఉండాలి. ఇందులోని రహస్య మేమిటని అడగా లనుకున్నాను కాని, అది చాలా అప్రస్తుత విషయంగా తోచింది, దాంతోపాటు మరొక ఆశకూడా బలపడింది. శేఖరం ధోరణి చూస్తే ఆఫీసులో చాలా గొప్ప పలుకుబడి- బహుశా యజమానుల్ని కూడా ఆజ్ఞాపించేటంత హోదా ఉండి ఉండాలి: కనుక నాబోటి వాడికి ఒక్క ఉద్యోగాన్ని ఇప్పించట మంటే పెద్ద విషయం కాదు.

చాలాసేపు చదరంగం ఆడాం. నా మనస్సు ఆట మీద నిలవటం లేదు. పక్వమైన ఫలం, ఆకలిగొన్నవాడికి అందుబాటులో కొచ్చి, చేతుల్లో పడేముందు కలిగించే ఆతృతలాటిది నన్ను వేధిస్తోంది. తొందరపడితే

కొమ్మ విరిగి మీద పడటమో, లేక పట్టుతప్పి నేల కరవటమో జరుగుతుందనే భయంతో చస్తున్నాను! ఎలాగైనా రాత్రికి ఉద్యోగం సంగతి ప్రస్తావించి తేల్చుకుందామని నిశ్చయించుకున్నాను.

సాయంత్రం నాలుగు దాటినా, ఆఫీసుకు వెళ్ళాలనే మాటే శేఖరానికి గుర్తు లేనట్లుంది. నేను జ్ఞాపకం చేద్దా మనుకున్నాను కాని, మరికొంచెం సేపు చూద్దా మనుకున్నాను. ఇంతలో మళ్ళీ సేవకు డొచ్చి, ఆఫీసునుంచి ఫోనులో పిలుస్తున్నారని చెప్పాడు.

శేఖరం విసుక్కొని "వొస్తున్నానని చెప్పు. ప్రాణం తీస్తారు వెధవలు!....కారు సిద్ధంగా వుందా?" అన్నాడు.

"సిద్ధంగానే వున్నదండీ!" అని సేవకుడు వెళ్ళిపొయ్యాడు.

నాకు నిజంగా ఆశ్చర్యకరమైన విషయ మేమిటంటే ఆఫీసు శేఖరానిది కాదు; వీడు మేనేజర్ మాత్రమే! ఐనప్పుడు తా నొక ఉన్నతోద్యోగే కాని, యజమాని కాడు. ఎగుమతి దిగుమతుల వ్యాపార సంస్థ కనుక, ఏ మాత్రం అజాగ్రత్తగా కానీ, నిర్లక్ష్యంగా కానీ ప్రవర్తించినా నష్టం రావొచ్చు. ఆ నష్టాన్ని భరించేది ఇతరులు. మరి శేఖరం ధోరణి ఆ యజమానుల్ని ఎందుకు వేధించదు? తన కింద జీతానికి పని చేసే ఉద్యోగి, ఎంత గౌరవనీయుడైనా, ఉద్యోగి మాత్రమే కనుక, యాజమాన్యానికి కట్టుబడి ఉండితీరాలి. అలాటి పట్టింపులు శేఖరాన్ని వేధించటం లేదు. ఒకవేళ వీడు కూడా ఆ వ్యాపారంలో భాగస్థుడే నేమోననే అనుమానం కూడా కలిగింది.

"పద ఆఫీసుకు వెళ్ళొద్దాం—" అన్నాడు.

మెదలకుండా కారులో ఎక్కాను.

ఆఫీసులో శేఖరాన్ని చూడగానే హడలిపోతున్నారు; తమపై పెత్తందారు కనుక, ఇలా భయపడటం జరిగిందని సరిపెట్టు కొన్నాను.

కాని సంస్థ యజమాని ఎదురొచ్చి నమస్కరించాడు. చిరునవ్వుతో "తమకోసమే చూస్తున్నాం." అన్నాడు.

శేఖరం కేవలం తల ఆడించి, మేనేజర్ అని రాసి వున్న గదిలోకి జొరబడ్డాడు; నేను లోనికి వెళ్ళవొచ్చో, వెళ్ళరాదోనని ఆలోచనలో పడ్డాను. ఇది గ్రహించి, శేఖరం నన్ను బరబరా లోనికి లాక్కు వెళ్లాడు.

టేబిల్‌మీద ఫైళ్ళు అమర్చి వున్నవి. పక్కనే సేవకు డొకడు సంతకాలైన వాటిని లాగి వేసేందుకు సిద్ధంగా ఉన్నాడు.

శేఖరం కాళ్లు రెండూ టేబిల్‌మీద నిగడ తన్నాడు; ఒక్కొక్క కాగితాన్నే పైనుంచి కిందికి ఒక్కసారి చూడటం, సంతకం చేయటం చేస్తున్నాడు; అసలు సరిగా చూస్తున్నాడా లేదా అనే అనుమానం నాకు కలిగింది.

మధ్యలో ఆగి పెద్ద గుమాస్తాను పిలవమన్నాడు. పెద్దగుమాస్తా-ముసలాడు వొణుక్కుంటూ వచ్చాడు.

"ఏమయ్యా! ఇంపోర్ట్ లైసెన్సు లన్నిటికీ దరఖాస్తులు పూర్తయినవా?" అన్నాడు.

"దాదాపు ఐనయ్ సార్!"

"దాదాపు!" అన్నాడు శేఖరం మండిపోతూ. "ఏం చేస్తున్నారు మీరంతా? అవసరమైనప్పుడైనా మరో గంటో, రెండు గంటలో పని చెయ్యక పోతే ఎలా? నిద్దర్లు పోతూన్నవాళ్ళను నేను ఇంటికి పంపుతాను; హాయిగా నిశ్చింతగా నిద్రపోవొచ్చు!"

"ఇవాళ పూర్తి చేయిస్తాను సార్!" అన్నాడు ముసలి గుమాస్తా హడలిపోతూ,

"సరే వెళ్ళు!"

బతికి బైటపడ్డా ననుకొన్నట్టున్నా డా ముసలివాడు.

ఆఫీసుకు వొచ్చేందుకే తీరుబాటులేని శేఖరం, మిగతా గుమస్తాలు నిద్రపోతున్నారనటం ఎంత న్యాయమో అర్థమౌతోంది. ఒకో స్థానం, దాన్నికున్న విలువ, చేతుల్లో వున్న అధికారం-అలాటిది! అధికారాన్ని వినియోగించటంలో న్యాయా న్యాయాలూ, విచక్షణాలూ, మానవత్వం మొదలైనవి మచ్చుకన్నా కనిపించని విషయం, యీనాడు నా అనుభవంలో కొత్త కాదు.

బైటినుంచి ఒక ప్యూన్ వచ్చి శేఖరానికి పక్కగా వొంగి నిలబడి కొంచెం రహస్యంగానే "ప్రొప్రయిటర్‌గారు తమతో మాట్లాడుతారట. ఒక్కసారి అక్కడికి వొస్తారేమో కనుక్కోమన్నారు" అన్నాడు.

నా అనుమానాలు పటాపంచలైనవి. శేఖరం కేవలం మేనేజరే కాని,

యజమాని కా డన్నమాట! మరి యజమాని కూడా శేఖరానికి అడుగులకు మడుగు లొత్తుతున్నా డంటే వీడి తెలివి తేటలూ, మేనేజిమెంటూ కారణ మేమో?

"ఆయన్నే యిక్కడికి రమ్మను!" అన్నాడు శేఖరం అధికార స్వరంలో.

ప్యూన్ పిల్లి వలె మెత్తగా నడుచుకుంటూ వెళ్ళిపొయ్యాడు.

ఐదు నిమిషా లయ్యాక. యజమాని గదిలోకి ప్రవేశించాడు. పాఠం చదవక, నలుగుర్లోనూ అవమానించబడటమేగాక, టీచర్ చేతుల్లో బడితె పూజ కూడా జరుగుతుందని భయపడే ఎలిమెంటరీస్కూలు విద్యార్థి కళ లన్నీ ఆ యజమానిలో స్పష్టంగా వ్యక్తమౌతూన్నవి. ఇంతకూ శేఖరంలో ప్రత్యేకత ఏదో ఉండి ఉండాలి.

యజమాని వొచ్చి పక్కనే కుర్చీలో కూర్చున్నా. శేఖరం గమ నించనట్లే కాగితాలమీద సంతకాలు పొడుస్తున్నాడు.కనీసం ఆ ముసలాయన వయస్సునన్నా గౌరవించలేదు; టేబిల్‌మీద బారజాపిన కాళ్ళు కూడా లాక్కోలేదు. బహుశా శేఖరంలోని ఒక గొప్పను సంస్థ అభివృద్ధికి వుప యోగ పెట్టుకుంటున్నాడు కనుక అతనిలోని నైచ్యాన్ని (?) కూడా యజ మాని దేవుడో అంటూ భరిస్తూండి ఉండాలి. ఆ బ్రహ్మ రహస్య మేదో వా రిద్దరికీ క్షుణ్ణంగా తెలుసు; అది తెలియకనే నేను నా నా బాధ పడుతున్నాను.

పది నిమిషాల తర్వాత కాని యజమానిని శేఖరం మొహమెత్తి చూడలేదు! చూసినా ఆ చూపులో కూడా ఎంతో విసుగు, కోపం 'ఏమిటి?' అని తొందరపెట్టే తత్వం యెంత మూర్ఖుడికైనా ఇట్టే తెలిసేట్టుగా వుంది.

"ఏం లేదు—" అన్నాడు యజమాని నీళ్లు నములుతూ.

"చెప్పండి....వీడు మావాడే లెండి!" అన్నాడు శేఖరం, నేను బయటికి పోదా మనుకుంటూండగా. ఇప్పుడు కదలటమంటే శేఖరం అధికా రాన్ని అవమానించిన ట్లవుతుంది కనుక చచ్చినట్లు ఊరుకున్నాను,

"మన లైసెన్సులకు బేరం వొచ్చింది; అమ్ముదా మంటారా? లేక సరుకు హార్బర్‌లో దిగిం తర్వాత ఆలోచిద్దామా?" అన్నాడు యజమాని.

"తొంద రెందుకూ? అమ్మకుంటే ఏమొస్తుంది కనకా! సరుకు దిగిం తర్వాత చూసుకోవాచ్చు—"

యజమాని ఏదో మాట్లాడబోయ్యాడు కాని, శేఖరం ముఖ భంగిమ చూసి చప్పున చల్లారి పోయ్యాడు. అంతేగాక క్షణంలో తన ముఖ కవళి కల్ని కప్పిపుచ్చుకుంటూ "నేనూ అదే అనుకున్నాను లెండి....!" అంటూ బలవంతాన చిరునవ్వును వెడలగ్రక్కుతూ లేచి వెళ్ళాడు.

"సరే, ఇక వెళ్దామా?" అన్నాడు శేఖరం; వొచ్చి పావుగంట కాక పోయినా, మొహానికి పట్టని చెమటను సిల్కు జేబురుమాలుతో తుడుచుకుంటూ.

నేను లేచి నిలబడ్డాను; వాడు కూడా అతి కష్టంమీద టేబిల్ మీది నుంచి కాళ్ళను భూమి మీదికి జార్చాడు. టకటకమని బూట్లు శబ్దం చేస్తుం డగా ఆఫీసులోనుంచి చకచకా నడిచి వొచ్చాడు.

మంత్రుల కొక్కళ్ళకే ఇలా జరుగుతుంటుందని విన్నాను కాని, శేఖరం వ్యవహారం చూశాక,వాడి ఉద్యోగంలోని ఠీవిని గ్రహించగలిగాను.

కారు బీచ్ వైపు పరుగెత్తింది, జనసంచారం లేనిచోట మెత్తని ఇసుకలో కూర్చున్నప్పటికీ, నాలో పనిచేసే భావాల సంఘర్షణకు మాత్రం శాంతి కలగ లేదు.

"ఏమిటీ అలా ఉన్నావ్?" అన్నాడు శేఖరం.

"ఏంలేదు....రోజూ ఆఫీసు పని ఇంతేనా?" అన్నాను, ఉదయం నుంచీ వా డిచ్చిన చనువును దుర్వినియోగపరిచేందుక్కూడా సిద్ధపడి.

"ఏం? నవ్వొస్తోందా? ఒకోనాడు అసలు ఆఫీసుకే వెళ్ళను. వెధవ కాయితాలు-ఏరాత్రి పూటో ఇంటికి వొస్తే, మర్నాడు ఉదయమో, మధ్యా హ్నమో సంతకాలు చేస్తాను" అన్నాడు వాడు నిర్లక్ష్యంగా.

"అదికాదు....నీవింత పట్టించుకోకుండా ఉంటే వ్యాపారం చెడదా?" అన్నాను.

"చెడనీ....యీ బోడి ఉద్యోగం పోతుందని భయమా?పోతేమాత్రం దిగు లేమిటి?"

"నీబోటివాడికి వాళ్ళిచ్చేజీతం రానంత మాత్రాన జరగదని కాదు...."

నామాట పూర్తికాకుండానే "జీతం! నా జీతం ఎం తనుకుంటు న్నావు?" అన్నాడు వాడు.

"ఏమో-ఏ రెండు వేలో ఉంటుందేమో?"

"కాదు....విను....నీకంతా తెలియదు కనుక నా ప్రవర్తన వింతగా వుంది. నా జీతం రెండువేలుకాదు; నాలుగు వేలై ఉండొచ్చు; అంతకన్న ఎక్కువా ఉండొచ్చు"

"ఉండొచ్చేమిటి? అసలెంతంటావు?" అన్నాను అనుమానంలో పడి.

"అసలూ లేదు; వడ్డీ లేదు. అసలు జీతమే లేదు!" అన్నాడు వాడు నవ్వుతూ.

"వేళాకోళా లాడుతున్నావు, జీతం బత్తెంలేని ఉద్యోగం చేయ వలసిన ఖర్మ నీకేమిటి?" అన్నాను.

"ఖర్మని ఎందు కనుకుంటున్నావు? జీతం బత్తెంలేని ఉద్యోగం చేయగలిగే సామర్థ్యమని ఎందుకు కనుకోవు? నేను నిజం చెపుతున్నాను. నాకు జీతమనేదే లేదు!"

"ఒకవేళ ఇది నిజమైనా, జీతం లేనివాడిమీద ఇంత గౌరవం అత నంటే ఇంత హడల్ దేని కుంటుంది?"

"జీతం తీసుకోనందుకే! అందరిలాగే నేనుకూడా జీతం తీసుకుం టూన్నట్లయితే, నాకు జీతమిచ్చే వాడికింద పడి ఉండవలసి ఉండేది. నేను స్టాఫ్‌ను దబాయిస్తున్నట్లే, నన్ను కూడా యజమాని దబాయించేవాడు కదా! ఎప్పుడైతే ప్రతిఫలమనేది ఆశించానో, దాన్ని పొందేందుకుగాను, ఆ ప్రతి ఫలాన్ని ఇచ్చే వారి ఆదరణకోసం నానాపాట్లు పడాలి. స్వలాభాపేక్ష లేనందువల్లనే. నేను వీళ్ళందరికన్నా ఉత్తముణ్నియ్యాను. ఆ రహస్యం వాళ్ళకూ్కాడా తెలుసు గనుకనే నన్నొక దివ్యపురుషుడుగా అంగీకరించక తప్పటం లేదు!" అన్నాడు వాడు, అరటిపండు వొలిచి అరిచేతులో పెట్టి నంత తేలిగ్గా.

నేను దిమ్మెరపోతున్నాను. వీడు చెప్పిందంతా నిజమేనని ఒప్పు కోక తప్ప లేదు. ఐతే యీ బోడి గౌరవంకోసమే యీ సంస్థ మేనేజ్ మెంట్‌ను భుజాలమీద వేసుకొని ఉంటాడా?

"నీకూ్కాడా ఏమన్నా భాగం వుందా?" అన్నాను అనుమానం తీరక.

"అబ్బే!" అన్నాడు వాడు వాళ్ళు కాస్త దగ్గిరుంచుకొని జాగర్తగా వినమని నన్ను హెచ్చరించేందుకు వీపుమీద చిన్న దెబ్బ వేసి. "భాగం తీసుకోమనీ, అందుకు పెట్టుబడి అక్కర్లేదనీ మా బాయిలర్‌గాడు అనేక

సొమ్ము ప్రాధేయ పడ్డాడు. కాని నేనే నిరాకరించాను. ఏనాడైతే భాగం తీసుకుంటానో ఆనాడే బాధ్యతలు తలమీద దూకుతయ్. రేపు ఏదన్నా ఆలస్యమైతే 'భాగస్తుడివై ఉండీ ఇలా చేయట మేమిటయ్యా?' అంటాడు యజమాని. లేదా నేను భాగస్థుణ్నే కనుక, భాగస్థుల మధ్య వొచ్చే తగాదాల్లాటివి రానూవొచ్చు! ఇప్పుడేముందీ - లాభమైనా, నష్టమైనా వాడిదే! నాకేమీ అక్కర్లేదు కదా! అందుకని నన్నేమంటాడూ? వీడి తాతగాడి సొమ్ము నే నేమన్నా కావా లన్నానా?''

''పోనీ నీవు వేరే వ్యాపారం పెట్టరాదూ?'' అన్నాను. ఒకడి కింద ఉద్యోగం చేయటం ఇష్టంలేనివాడికి అంతకన్న మంచి తోవ ఏముంటుంది?

''ఎందు కొచ్చిన లంపటం? వ్యాపారంలో చిన్నభాగమే తలనొప్పి అనుకున్నప్పుడు, మొత్తం వ్యాపారం ఏం చేసుకోను? ఎన్ని బాధ్యతలు, తలనెప్పులు వెంటాడుతయ్! మనంతట మనం చేస్తే, లాభ మొస్తుందో, నష్ట మొస్తుందో తెలియదాయె! ఈ ఆఫీసులో నంటావా, బొండుగాడి అదృష్టం బాగుంటే లాభం వొస్తుంది, లేదా నష్టం వొస్తుంది. నావల్ల ఏదైనా జరిగిం దనుకునేందుకు వీల్లేదు కదా! ఉదాహరణకు ఇందాక లైసెన్సులు అమ్ముకుందామా అని అడిగాడు. అమ్ముకుంటే ఏదో వొక లాభం యీనాడే చేతుల్లో పడుతుంది. ఆగమని చెప్పాను. తీరా సరుకు దిగాక మంచి ధర పలకనూ వొచ్చు. లేక మనతోపాటే చాలామంది అదే సరుకు దిగుమతి చేసివుంటే రేటు పలక్కనూ పోవచ్చు. అదంతా యజమాని అదృష్టం. ఇతర్ల వ్యవహారం కనుకనే అంత తేలిగ్గా సలహా చెప్పాను. మన స్వంతమైతే ఎంత బాధో ఆలోచించు!'' అన్నాడు శేఖరం.

విషయం సుబోధకరంగానే వుంది. కాని శేఖరం ఇంత పెద్ద ఉద్యోగం చేసుకుంటూ దమ్మిడీ కూడా ఆశించ కుండటం అర్థం కాలేదు.

''ఈ ఉద్యోగంవల్ల నీ కేమొస్తుంది కనుక? ఇంటిపట్టునే ఉండరాదా పోనీ!'' అన్నాను.

వాడు నవ్వాడు-బహుశా తనలాగు ఆలోచించ లేని నా అశక్తతను హేళన చేయటానికేమో?

అన్నాడు: ''అది సర్వోత్తమమైన పద్ధతి; ఎందుకంటే ఇవాళ ఉద్యోగంచేసి సంపాయిస్తేనే కాని జరగదు కనుకనా? ఐతే ఇంత

చదువూ చదివి, ఇంట్లో భార్యకు ఎదురుగా కూర్చుంటే ఆమె ఏమను కుంటుంది? తన భర్త యీ ప్రపంచంలో బిడ్డల్ని కనిపించేందుకు తప్ప, మరెందుకూ పనికి రాడేమో ననే అనుమానం ఆమెకు కలగదా? పురుష లక్షణమైన ఉద్యోగం లేనిదే ఆమెకు భర్తమీద గౌరవం ఏముంటుంది? నేనంటే ఆఫీసంతా గడ గడలాడి పోవటం చూశాకన్నా, కనీసం విన్న తరువాతైనా, ఆమె కూడా గడగడలాడక తప్పదు. అది ప్రపంచ ధర్మం కదా! ఐతే మొదట్లో నేనూ అందరిలాగే మామూలు ఉన్నతో ద్యోగాలకు ప్రయత్నించాను. ప్రతివాడూ మన తాహతు చూసి, మనను భరించలేమనే అభిప్రాయంలో పడినట్లు తోచింది. కనుక జీతం వ్యవహా రమే లేకుంటే చాలా గొప్ప ఉద్యోగం సంపాయించ వొచ్చనే ఐడియా మెరిసింది. దాంతోనే ఇప్పు డీ ఆఫీసుకు మేనేజ ర్నయ్యాను. ఊరికనే దొరికాను కదానని యజమాని ఆశపడ్డాడు, కాని ఇందువల్ల ఎలాటి అడ కత్తెరలో తాను పడ్డాడో, తనకన్నా ఉత్తమోత్తమమైన మానవుణ్ని చేతు లారా నెత్తి కెక్కించుకున్నాడో, గ్రహించటం జరిగింది కాని-అది చాలా ఆలస్యమైపోయింది. అంటే నన్ను వొదిలించుకోవాలంటే అతనికి కష్టమని కాదు. కాని నాలాటివాడు, జీతం బత్తెం లేకుండా మరెవడు దొరుకుతాడు? అతనికా యింగ్లీషు బాగా రాదు. ఇంకెవర్నన్నా పెడితే మోసం చేస్తారని భయం. మనమంటే, ఏమీ ఆశించలేదు కనుక, మోసం చేయవలసిన పనే లేదు. ఈ ఉద్యోగం వుందే-ఇదంతా నాకు, బహుశా నీకూ్కడా నవ్వు లాటగానే తోస్తుంది. సమాజంలో కాస్త హోదా వెలగబెట్టాలి; ఎంతసేపని కాంపౌండ్ గోడల వెనుక దాక్కుంటాం కనుక? ప్రపంచంలోపడి జీవి తాన్ని యెదుర్కొనే వారికి వెనుక వున్నా, మనమూ ప్రయోజకుల మనేది రుజూ చేసుకోవాలి. 'ఏం చేస్తున్నావ్?' అని ఎవరన్నా అడుగుతే, చెప్పు కునేందుకన్నా ఒక ఉద్యోగం ఉండాలి కదా!''

నా కిప్పుడు బాగా అర్థమైంది. శేఖరం చేసే ఉద్యోగం లాటిది ప్రపంచంలో ఎక్కడన్నా ఉన్నదేమో నే నిదివరకు వినను కూడా లేదు. వాడి తెలివి తేటల్ని అర్థం చేసుకుంటుంటే నాకు మతిపోతున్నట్లుంది.

వా డింకా చెప్పసాగాడు: ''ఈ ఉద్యోగం నాకెంతో సుఖంగా

వుంది. సెలవు రాస్తేకాని ఆఫీసుకు పోకుండా వుండలేమనే బాధ లేదు. నా కిష్టమైతే వెళ్తాను; లేదా మానేస్తాను. ఎవరి మీద ఎంత అధికారం చూపినా అడిగే నాధుడు లేడు. నన్ను ఏమన్నా అనేందుకు, యజమాని నాకేమన్నా యిస్తున్నాడు కనుకనా? జీతమనేది ఏర్పరుస్తానని యజమాని ఎన్నోసార్లు వెంటాడాడు; వీల్లేదు పొమ్మన్నాను. జీతమనే గొందిలోకి నన్ను ఇరకేద్దామని అతని అభిప్రాయం. ఏనాడైతే నేను జీతం తీసుకుంటానో, ఆనాడే నాకు ఆఫీసులో వున్న అధికారం దానంతటదే తగ్గుతుంది; ఆనాటి నుంచే యజమాని కూడా కాస్త కఠినంగా మాట్లాడే అవకాశం వుంటుంది. ఇప్పుడంటావా యజమాని కూడా నేనే జీతమిస్తున్నాను కనుక, నాకింద బడి తొత్తల్లే పడి వుంటున్నాడు!"

"నీవు యజమానికి జీతం ఇస్తున్నావా?" అన్నాను, చాలా విచిత్రమైన విషయాన్ని విని.

"ఔను. జీత మనేది నేను తీసుకుంటే నా విలువ రూపాయిలు, అణాలు, పైసల్లో నిర్ణయించబడిందన్న మాటే కదా! జీతం లేదు కనుక, నా విలువ కేవలం ఊహలో ఎంతన్నా పెరిగే అవకాశం వుంది. నేను ఏ జీతాన్నయితే తీసుకోవటం లేదో, అదంతా యజమానికి మిగులుతూనే వుంది; కనుక నా జీతాన్ని అతనికి ఇస్తున్నట్లు కాదా?"

నాకు తల తిరిగిపోయింది. జీతం బత్తెంలేని ఉద్యోగమని హేళన చేస్తాం కాని, అదెంత గొప్పదో ఈ క్షణం వరకూ నేను గ్రహించలేదు. శేఖరాన్ని చూస్తే, వాడి ఉద్యోగం దానికున్న హోదా మొదలైనవి తేలిగ్గా అర్థమైనయ్. ప్రపంచంలో చేస్తే ఇలాటి ఉద్యోగం చేయాలి....ఐతే నా బోటివాడికి ఇది సాధ్యం కాగలదా?

శేఖరానికి వున్న పలుకుబడిని అతనే ఉపయోగించటం లేదు. నా కోసం వినియోగపరచ మనటం ఎంత అన్యాయం! కనుకనే ఉన్న నాలుగు రోజులూ నాకో ఉద్యోగం దొరకలేదనే చింత వేధించలేదు. శేఖరం చేస్తున్న ఉద్యోగంలాటి దానికే ప్రయత్నించాలనే కలలు ఎక్కువైనవి. ఇటు కలల్తో తృప్తిపడలేకా, అటు నా తలకు మించిన అలాటి ఉద్యోగం కోసం ప్రయత్నించలేకా, బుర్ర గోక్కుంటూ ఇంటిదారి పట్టాను.

—ఫిబ్రవరి, 1956.